చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వినోద్‌బాబు

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎం.వినోద్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి సోషల్ మీడియా సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన వినోద్ బాబును ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నియమించింది. దీంతో ఆయన సోమవారం చింతపల్లి చేరుకుని సీఐ రమేష్ నుండి లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రులతో ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఎస్పీ, చింతపల్లి డి.ఎస్.పి ల సూచనలు, సలహాలు స్థానిక పోలీసులు, పాత్రికేయులు, ప్రజల సహకారంతో శాంతి భద్రతలను పటిష్టంగా నిర్వహిస్తానన్నారు. మన్యంలో పరిస్థితులను అవగాహన చేసుకుని గంజాయి సాగు, అక్రమ రవాణా, అసాంఘిక కార్య కలాపాలు నియంత్రణపై కఠినంగా వ్యవహరిస్తానన్నారు. అదే క్రమంలో గ్రామంలో అతివేగంగా తిరిగే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాలలోనూ పోలీసు నిఘాను పటిష్టం చేస్తామన్నారు.

అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మిస్తాం

- రూ.1800 కోట్లతో 1300 గ్రామాలకు రోడ్లు
- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : ఏజెన్సీలో ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మించి డోలీ మోతలను నివారిస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం పాడేరు మండలంలో పర్యటించి బంగారు మెట్ట గ్రామంలో ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ రూ. 46 కోట్లతో సీలేరు రోడ్డును అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని త్వరలో మళ్లీ వచ్చి సీలేరు రోడ్డు పనులను ప్రారంభిస్తానని చెప్పారు. రానున్న రెండేళ్లలో రూ.1800 కోట్లతో 1300 గ్రామాలకు రోడ్లు నిర్మిస్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారని అన్నారు. దీపావళి కానుకగా అర్హులైన లబ్దిదారులకు దీపం పథకం 2.0 పథకంలో ఉచిత గ్యాస్ పంపిణీని ప్రారంభించారని చెప్పారు. డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు అందించి మహిళల గౌరవం పెంచారని పేర్కొన్నారు. ప్రతీ మండలంలోను ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తామన్నారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు నేరుగా కాస్మోటిక్స్ అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. విద్యార్థుల మెస్ చార్జీలను పెంచుతామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతానికి మరో 35 అంబులెన్సులు మంజూరు చేస్తామని ముఖ్య మంత్రి చెప్పారని అన్నారు. గిరిజన గ్రామాలకు సోలార్ విద్యుత్తు

సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం అలోచన చేస్తోందన్నారు. కాఫీతో సహా అన్ని రకాల గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ దీపం పథకం పేదలకు వరమని అన్నారు. జిల్లాలో 1300 గ్రామాలకు రోడ్లు లేవని విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లామని చెప్పారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లన్నారు. ప్రతీ ఆడ బిడ్డకు ఉచిత గ్యాస్ అందిస్తారన్నారు. పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ దీపం పథకం పెట్టిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగంలో అక్షయపాత్ర విధానాన్ని అమలు చేస్తే సహించేది లేదు

విశాలాంధ్ర - చింతపల్లి : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకు వస్తున్న అక్షయపాత్ర విధానాన్ని మన్య ప్రాంతంలో అమలు చేస్తే ఊరుకునేది లేదని వందల మంది విద్యార్థిని, విద్యార్థులతో కలిసి భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నేతలు చింతపల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి జీవన్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ, నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాలలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ ఫీజులు తగ్గించాలని, డిగ్రీ మైనర్ హానర్స్ విధానం రద్దు చేయాలని, డిగ్రీ అడ్మిషన్ ఆన్లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్ లైన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అనేక మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారంటే విద్యార్థులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న

అడ్మిషన్ ఫీజుల భారం వలన అని, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరణిస్తున్న విద్యార్థులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ప్రతి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సహాయ కులను నియమించాలని, వంట చేసే కార్మికులను నియమించడంతో పాటు, వారికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే క్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వాచ్మెన్ లను నియమించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు 1600 నుండి 3000 వరకు పెంచాలనీ, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలనీ, పెండింగ్ లో ఉన్న వసతి దీవెన, విద్యా దీవెన, తల్లికి వందనం బకాయిలు 3480 కోట్లను తక్షణం విడుదల చేయాలని, శిథిలావస్థకు చేరిన గిరిజన ఆశ్రమ పాఠశాలల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని న్యాయమైన ఈ డిమాండ్లన్నీ నెరవేర్చే వరకు ఉద్యమాలు ఆపే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్ర్ రాజ్ కుమార్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, వందల సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి
ఎంఇవో సుందరరావు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని స్థానిక ఎంఇవో ఎస్. సుందరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కురిడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి ఉపాధ్యాయుల బోధన, ఇయర్ ప్లాన్స్, లెసన్ ప్లాన్, టీచర్స్ డైరీ, తరగతి పరంగా కాల నిర్ణయక పట్టిక, విద్యార్థుల నైపుణ్యం, వర్క్ బుక్స్ కరెక్షన్స్, పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డ్స్, మధ్యాహ్న భోజన పథకం మెనూ చార్ట్, మన బడి - మన భవిష్యత్తు పనులు, పాఠశాలకు సంబందించిన ఫెసిలిటీస్ తదితర అంశాలపై పరిశీ లించారు. అనంతరం 3, 4 ,5 తరగతుల పిల్లలకు ఉక్త లేఖనం చేసి వారి ప్రగతిని స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి మెరుగు పర్చడానికి తెలుగు, ఆంగ్లంలో భాషా పదజాలం అభివృద్ధికై పఠనం, భాషణం, లేఖనం మరియు గణితంలో చతుర్విధ ప్రక్రియలు సామర్థ్యాలను సాధించేందుకు పాఠ్య ప్రణాళికలు రూపొందించి వివిధ రకాల బోధనా పద్ధతులను అనుసరించాలని ఆయన చెప్పారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన తరల్ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - వై.రామవరం : ఈనెల 28 నుండి జరుగుతున్న ఉపాధ్యాయుల తరల్ శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. యార్లగడ్డ లో ఎంఈఓ తాతబ్బాయి దొర ఆద్వర్యం లో కీ రిసోర్స్ పర్సన్‌లు పలు సూచనలు ఇచ్చారు. 3 నుండి 10వ తరగతి వరకు వెనుక బడిన విద్యార్థుల సామర్థ్యాల ను మెరుగుపరచడం దీని ఉద్దేశ్యమని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలివలసలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి : సీపీఐ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండలంలోని సోవ్వ పంచాయితీ పరిధిలో నున్న మాలివలస గ్రామానికి మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, స్థానిక సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కే.సింహాచలం కోరారు. సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామంలో గల సమస్యలను గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో సరైన సిసి రోడ్లు, డ్రైనేజ్ వంటి సౌకర్యాలు లేవని ఆయన తెలిపారు. ఆ గ్రామ గిరిజనులకు రహదారి సౌకర్య కల్పనకు గతంలో ఆ గ్రామానికి రోడ్డు మంజూరైనప్పటికీ నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు అసంపూర్తిగా వదిలేశారని ఆయన చెప్పారు. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఆ గ్రామ గిరిజనులకు రవాణా కష్టాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అధికార యంత్రాంగం స్పందించి మాలివలస గ్రామంలో గల కనీస సౌకర్యాలైన సిసి రోడ్డు డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అసంపూర్తిగా నున్న రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఆ గ్రామ గిరిజనులకు రవాణా కష్టాలు తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ గిరిజనులు యువత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి
వీవోఏ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి

విశాలాంధ్ర - అరకులోయ : వివో ఏలు, యానిమేటర్లు కాల పరిమితి మూడు సంవత్స రాలుగా నిర్ణయిస్తూ గత వైసీపీ ప్రభుత్వం జారీచేసిన సర్క్యులర్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏపీ వెలుగు వివోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రూపా దేవి విజ్ఞప్తి చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వివోఏ (యానిమేటర్ల) సమావేశంలో పాల్గొని ఆమె ప్రసంగించారు. గత నెల 25వ తేదీన జిల్లా పరిషత్ సమావేశంలో వివో ఏ లను తొలగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేయడం వల్ల వివో ఏలు ఆందోళన చెందుతున్నారు అన్నారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దుకై రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల వద్ద ఈనెల 6, 7, 8వ తేదీలలో ధర్నాలకు సిద్ధపడాలని రాష్ట్ర అధ్యక్షురాలు రూపా దేవి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు, జిల్లా వివోఏ ప్రధాన కార్యదర్శి ఎల్బి రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి పోతురాజు, అల్లూరు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 6న జిల్లా కేంద్రం పాడేరులో సీపీఐ సమితి సమావేశం

విశాలాంధ్ర - కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 6న భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 6న పాడేరులో నిర్వహించనున్న పార్టీ జిల్లా సమితి సమావేశానికి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తదితర పలువురు రాష్ట్ర జిల్లాల స్థాయి నేతలు హాజరు కానున్నారన్నారు. కావున ఈ సమావేశానికి పార్టీ జిల్లా సమితి సభ్యులు విధిగా హాజరుకావాలని సత్యనారాయణ కోరారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ రాజేష్

విశాలాంధ్ర - సీతానగరం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజేష్ తెలిపారు. సోమవారం మండలంలోని చినబోగిలి రాష్ట్రీయ రహదారిపై వాహనాలు చెకింగ్ చేస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలన్నారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్ వైపు వెళ్ళవద్దని

సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతిరోజు అవగాహన కార్యక్రమాలు ము మ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్య కమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసరావు, లక్ష్మణరావులు పోలీస్ సిబ్బంది సుజాత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అప్పయ్యపేట గ్రామం వద్ద రాష్ట్రీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఉండే తుప్పలు, డొంకలను జెసిబితో తీసే చర్యలు చేపట్టారు.

పీజీఆర్ఎస్ పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులు పరిస్కరించండి
జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. భవిష్యత్తులో పీజీఆర్ఎస్ అర్జీలు పెండింగ్ ఉండరాదని తేల్చి చెప్పారు. ఇందుకు ఆయా శాఖల్లో ఒక నోడల్ అధికారిని నియమించి, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం పట్ల శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపి, జిల్లాకు చెడ్డ పేరు వచ్చేలా అధికారులు నడుచుకుంటే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సోమ వారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ పై అన్ని శాఖల అధిపతులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్‌కు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. జిల్లాలో తక్కువగా అర్జీలు అందుతున్నప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వలన జిల్లాకు చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వచ్చిన అర్జీలను ఎప్పటి కపుడు పరిశీలించి, సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సమస్యపై తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, అర్జీ మరలా రీ ఓపెన్ అయ్యే పరిస్థితి ఉండరాదని కలెక్టర్ తేల్చిచెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్నప్పటికీ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపని శాఖాధిపతులపై చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశారు. ప్రతి అర్జీ పరిష్కారానికి సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేయాలని, సామరస్య పరిష్కార దిశగా అర్జీలు పరిష్కరించబడాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోశ్ శ్రీ వాస్తవ, శాఖాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మిశ్రమ దాణా వల్ల మేలు



విశాలాంధ్ర - బెలగాం : పాడి రైతులు తమ పశువులు తినే ఆహారంలో మిశ్రమ దాణా వాడటం వల్ల పశువులకు ఖనిజ లవణాలతో పాటు విటమిన్లు తగిన మోతాదులో దాణా రూపంలో అందుతాయని జిల్లా పశు సంవర్ధక అధికారి డా. శివ్వాల మన్మథరావు అన్నారు. జిల్లాకు 125 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణాను కేటాయించగా, పార్వతీపురం మండలానికి 23 టన్నుల మిశ్రమ దాణా వచ్చిందని తెలిపారు. సోమవారం వెంకంపేట గ్రామంలో సబ్సిడీపై పాడి రైతులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మిశ్రమ దాణాలో మొక్కజొన్నలు, సజ్జలు, రాగులు, ఉలవలు, శనగలు, చెక్కలు, వరి తవుడు, చెరకు మడ్డి, ఖనిజ లవణాలు, విటమిన్లు, ఉప్పు లాంటి స్థూల పోషకాలుంటాయని వివరించారు. పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణాలు కలిపి ఒకేసారి మిశ్రమ దాణాగా పశువులకు మేతగా పెడితే పశువుల జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుందని తెలిపారు. అందువల్ల పాల ఉత్పత్తి శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా పాడి రైతులకు అధిక ఆదాయంతో పాటు శ్రమ తగ్గుతుందని అన్నారు. పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి డా: ఆర్. రమేష్, డా.కె.ప్రసాద్, డా.బి. చక్రధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి



విశాలాంధ్ర - సీతానగరం : కాకినాడలో నవంబర్ 1న వెల్ఫేర్ అసిస్టెంట్‌పై పెన్షన్ పంపిణీ విషయంలో జరిగిన దాడిని ఖండిస్తూ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా సచివాలయ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఎంపీడీవో త్రివిక్రమరావుకి వినతిపత్రంను అందించారు. ఈకార్యక్రమంలో మండల సచివాలయఉద్యోగులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బెలగాం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా ఆధ్వర్యంలో పార్వతీపురం మండలం అడ్డాపుశీల పంచాయతీ పరిధిలో విజయవాడ తుపాను వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు రూ.62,570ల (అక్షరాలా అరవై రెండు వేల ఐదువందల డబ్బై రూపాయలు) నగదును ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు, కార్యదర్శి ఆర్.లక్ష్మునాయుడు, అడ్డాపుశీల గ్రామం రైతు వైకుంఠం శంకరరావులు అందచేశారు.

నేత్ర వైద్య సేవలపై సమీక్ష



విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నవంబర్ 6వ తేదీ నుండి జనవరి 2025 20వ తేదీ వరకు మొదటి విడతగా 6 మండలాల పరిధిలో ఉన్న 138 సచివాలయాల పరిధిలో జరగనున్న కంటి పరీక్షలు కార్యక్రమంలో నిర్వహించు నేత్ర పరీక్షలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య అధికారులు, నేత్ర వైద్య సహాయకులకు ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలి, విద్యార్థులకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తదితర విషయాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో కంటి తనిఖీలు చేసిన వారికి దృష్టి దోషం వున్నా మరల నేత్ర పరీక్షలు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో వయసు మళ్లిన వారందరికీ నేత్ర పరీక్షలు చేయాలని ఆదేశించారు. జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి డా. జీరు నగేష్ రెడ్డి నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేసిన వారి వివరాలు ఎలా పొందు పరచాలో వివరిస్తూ మెల్ల కన్ను , గాయాల వలన వచ్చే కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు కోసం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారులు పల్లెనిద్ర చేయాలి : జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు గురువారం వసతి గృహాలను సందర్శించి, అక్కడ స్థితిగతులను తెలుసు కోవాలని, రాత్రికి అక్కడే బస చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోశ్ శ్రీవాస్తవతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులకు అప్పగించిన మండలాల్లోని వసతి గృహాలను ఈ గురువారం సందర్శించి, అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. ఆ రోజు రాత్రి అదే వసతి గృహంలో నిద్ర చేసి స్థితిగతులను తెలుసుకోవాలని అన్నారు. వసతి గృహాల సందర్శనలో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, నాణ్యమైన పోషక ఆహారంతోఉజ్ పాటు కిచెన్ గార్డెన్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వసతి గృహాలకు వెళ్లినపుడు చెక్ లిస్ట్ ప్రకారం అన్ని అమల వుతున్నదీ, లేనిదీ పరిశీలించాలని అన్నారు.

తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులతో పాటు పారిశుద్ధ్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి మెరుగైన ఫలితాలు సాదించేందుకు అవలంభించవలసిన విషయ పరిజ్ఞానంపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. గురువారం రాత్రి బస అనంతరం శుక్రవారం రోజున అదే గ్రామాన్ని సందర్శించాలని ఆదే శించారు. ఆ గ్రామంలో బహిరంగ మలవిసర్జన పట్ల ప్రజల్లోఅవగాహన కల్పించాలని, మరుగుదొడ్ల నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.15 వేలు మంజూరుచేస్తున్న సంగతిని ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామంలో తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలు లేకుండా చూడాలని, సమస్యలుంటే సంబంధిత అధికారుల ద్వారా ఆ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రక్తహీనత లోపం ఉన్న గర్భిణీలు, పిల్లలను గుర్తించి, వారి తల్లితండ్రులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం గురించి వివరిస్తూ, వాటిని ఉపయోగించుకునేలా చూడాలని చెప్పారు. ఆ గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని, పాఠశాలను కూడా సందర్శించాలని, అక్కడ పారిశుద్ధ్యం, న్యూట్రీ గార్డెన్, బాల విహార్, మై స్కూల్ - మై ప్రైడ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉన్నదీ లేనిదీ పరిశీలించి, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించేలా తల్లితండ్రులకు తెలియ జేయాలని ఆదేశించారు. చెత్త నుండి సంపద గురించి గ్రామస్తులకు వివరించి వాటిని ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు.. ఇందులో గ్రామ సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోశ్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో పింఛన్లు నిలిపివేయడం సరికాదు

విశాలాంధ్ర - బెలగాం/బలిజిపేట : పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం శాసనసభ నియోజకవర్గం బలిజిపేట మండలం నారం నాయుడు వలస గ్రామంలో కంది గౌరీ శంకర్రావు, చల్లా పాపమ్మ, బోను సింహాచలం, లండ సింహాచలం, నాగళ్ల అప్పడు, చిన్ని అప్పల నరసయ్య, కొప్పిశెట్టి పారయ్య అను ఏడుగురికి రాజకీయకక్షతో పింఛన్లు నిలిపి వేసారని ఇది అన్యాయం అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యమ్మల మన్మధరావు, గొర్లి వెంకటరమణ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం అందచేశారు. ఎఒ స్పందించి సంబందిత డిపార్ట్ మెంట్ తో చరవాణిలో మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ ఏ ఆధారం లేక జీవనం సాగిస్తున్న వీరికి అర్హులుగా గుర్తించి గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్నారని కేవలం రాజకీయ కక్షలతో కావాలని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కుంటి సాకులు చూపిస్తూ పింఛన్లు నిలిపివేసారని అన్నారు. నిలుపుదల చేసిన పింఛన్లు ఇవ్వకపోతే ఎండిఓ కార్యాలయం ముందు నిరశన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా అధ్యక్షులు రమణారావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టెంపుల్ రోడ్డును క్లియర్ చేసిన శ్రీవేణుగోపాలస్వామి అర్చకులు

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం ప్రక్కనేఉన్న సువర్ణముఖి నదికి వెళ్లేరహదారిని శ్రీవేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు దగ్గరుండి తుప్పలు డొంకలు కొట్టించడంతో పాటు రహదారిని ఏర్పాటుచేయించారు. కార్తీక మాసం కావడంతో భక్తులు పెద్దఎత్తున ఈరేవుగుండావెళ్లి నదీ స్నానం చేయడం జరుగుతుంది కనుక బాగుచేయడం జరిగిందన్నారు. సీతానగరంకు చెందిన దామినేని పెద్దబ్బాయి జేసిబి సహకారంతో బాగు చేయడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా కార్తీక మాసం కావడంతో పలు నీలాంటి రేవులను బాగుచేయించడం జరిగిందని సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ పంచాయతీ కార్యదర్శి రమేష్‌లు తెలిపారు.

జల ఉత్సవ్ కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర- వై.రామవరం : మండలంలో ఈ నెల 7 నుండి 20వ తేదీ వరకు జరిగే జల ఉత్సవ్ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎంపీడీవో బాప న్న దొర మండలస్థాయి అధికారులుకు సూచించారు. సోమవారం దీనిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నీతి అయోగ్‌లో ఏపీ లో ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం వీటికి ఎంపిక చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఈ నెల 6న స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రారంభించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ తాతబ్బాయి దొర, ఈవోపిఆర్‌డి శివకుమార్, ఏపీఓ స్వామి, ఇంజనీర్ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు పోరాడి విజయం సాధించిన కాఫీ కార్మికులు, హెల్పర్లు

కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డిసి) పరిధిలో పనిచేస్తున్న కాఫీ కార్మికులు, హెల్పర్లు ఏపీ ఎఫ్‌డిసి కార్యాలయంలో ఆర్‌ఎం, డిఎంలతో సోమవారం జరిగిన చర్చలలో ఎట్టకేలకు పోరాడి విజయం సాధించారని కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత నెల అక్టోబర్ 15న, 10 డిమాండ్ల తో కూడిన సమ్మె నోటీసు యాజమాన్యానికి ఇవ్వడం జరిగిందని స్పందించిన యాజమాన్యం నవంబర్ 19న ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ ల స్థాయిలో ప్రాథమికంగా చర్చలు జరిపి ఆ విషయాలను ఆ సంస్థ ఉన్నతాధికారులకు విన్నవించడంతో అవే చివరి చర్చలు అని యాజమాన్యం భావించిన, కాఫీ కార్మిక సంఘం అగ్రిమెంట్ రూపంలో కొన్ని డిమాండ్లు పరిష్కరిస్తేనే చర్చలు సారాంశమని ఆ సంస్థ రీజనల్ మేనేజర్ సమక్షంలో చర్చలు అగ్రిమెంటు జరగాలని యూనియన్ పట్టు పట్టడంతో దిక్కుతోచక సోమవారం రీజనల్ మేనేజర్ జ్యోతి సమక్షంలో డివిజనల్ మేనేజర్లు సత్యం, కృష్ణ బాబు, రత్న దీపిక, కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఎస్ కనకవల్లి, ఎల్ సుందర్రావు, జి సత్యనారాయణ, హెల్పర్ల సంఘం నుంచి, వెంకటేష్, గిరి, రాజారావు, కాంతమ్మ సమక్షంలో కొన్ని డిమాండ్ల పై చర్చించారు. కాఫీ కార్మికులకు కూలి రేట్లు, పళ్ళ రేట్లు ఏప్రిల్‌లో వీడీఏ పాయింట్లకు అనుగుణంగా 299 రూపాయలకు పెరిగిందన్నారు. రోజువారిగా రోజుకి 22 రూపాయలు, కేజీ పళ్ళ ధర,5 రూపాయల19 పైసలు పెంచడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు, పర్మినెంట్ వర్కర్లకు మూడు మాసాలలో క్వార్టర్స్ మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గడచిన మూడేళ్లుగా సంత రోజున వారాంతపు పేమెంట్లు మానేసి, నెలకు ఒకసారి పేమెంట్లు ఇస్తున్నారని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా, వచ్చే నెల నుంచి వారంతపు పేమెంట్లు సంత రోజున ఇస్తామన్నారు. కాఫీ తోటల్లో ప్రమాదాలు జరిగితే కార్మికులు కోలుకున్నంతవరకు వైద్యం ఖర్చులు భరిస్తామని, 15 రోజులపాటు వైద్యం ఖర్చులు, రోజు కూలి ఇస్తామన్నారు. తోటల్లో ప్రమాదం జరిగి మరణిస్తే ఆ కుటుంబానికి రెండు లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చేటట్లు సంస్థ నుండి ప్రభుత్వానికి తెలియపరిచి ఇప్పిస్తామన్నారు. ప్లాంటేషన్ హెల్పర్లకు, ప్రస్తుతం ఇస్తున్న వేతనం 11,000వేల నుంచి, 1,500 పెంచి డిసెంబర్ నుంచి 12,500 ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పర్మినెంట్ కార్మికులకు రెండు పండగలకు 5 ఉచిత మస్టర్ల డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. నెలలో 26 రోజులు పని దినాలు కల్పిస్తామన్నారు. క్షేత్రస్థాయి ప్లాంటేషన్ కండక్టర్లను బోర్డు ద్వారా నియమించుకునేటట్లు ప్రతిపాదన సంస్థ అవసరం నిమిత్తం 35 మందిని నియమించుకొనేటట్లు చూస్తామన్నారు. పై అంశాలు ఏడాది పాటు అగ్రిమెంట్ రూపంలో యాజమాన్యంతో కలిపి కాఫీ కార్మిక సంఘం హెల్పర్లు అమలయ్యే విధంగా కృషి చేద్దామన్నారు. పై డిమాండ్ల సాధన కోసం కాఫీ కార్మికులు ఐక్యంగా ఉండాలని ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ విశ్రాంత డివిజనల్ మేనేజర్ మహేష్, కాఫీ కార్మిక సంఘం ప్రతినిధులు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి అందరు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

విశాలాంధ్ర - జీకే వీధి : వైసీపీ బలోపేతానికి అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. గూడెం కొత్త వీధి మండల అధ్యక్షులు నిర్వహించిన నాయకులు ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అందరు కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేసి పనిచేయాలని కోరారు.గూడెం కొత్త వీధి మండలం ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వీర విధేయులుగా ఉన్నారని, మూడు సార్లు స్థానిక సంస్థ ఎన్నికలకు పాడేరు నియోజకవర్గం నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తోడుగా ఉంటూ మూడు సార్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గెలిపించారన్నారు. ఎమ్మెల్యేగా తనను మండలంలో మంచి మెజారిటీ ఇచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. నాయకులు కార్యకర్తలు ఎటువంటి అధైర్య పడకండి మండల నాయకులకు ప్రజలకు నేను అండగా ఉంటా, మీరు స్థానిక నాయకులు గా ప్రజలకు తోడుగా నెలవాలని కోరారు. మండలంలో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు నమ్మకంగా ఉందాం అన్నారు. కూటమి ప్రభుత్వం పరిపాలన పనితీరు చూస్తుంటే రాష్ట్రం మొత్తం అధోగతి చెందుతుంది, వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మనమందరం తోడుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైసిపి జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరి ప్రసాద్, ముట్టడం సత్యనారాయణ ఎంపీటీసీ, బొబ్బిలి లక్ష్మి సర్పంచ్, గబులంగి హరిబాబు, కంకిపాటి వీరేంద్ర పడాలి సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ లోత దేవుడు,చింతపల్లి జడ్పిటిసి పోతురాజు బాలయ్య, వీరోజి నాగరాజు సర్పంచ్, కంకిపాటి రామారావు, కాకూరి బుజ్జిబాబు సర్పంచ్, కోర్ర సుభద్ర సర్పంచ్, వివిధ పంచాయితీల ఎంపీటీసీలు, సర్పంచులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో భాష, గణిత సామర్థ్యాలలో వెనుగుబాటును పారద్రోలండి

విశాలాంధ్ర - చింతపల్లి /జీకే వీధి : టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణ కార్యక్రమం జీకే వీధి మండలంలోని రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. జీకే వీధి మండల విద్యాశాఖ అధికారులు రెడ్డి రామన్న, తగ్గి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏ ఎం ఓ పి భాస్కరరావు శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కరోనా అనంతరం విద్యార్థులలో భాషా మరియు గణిత సామర్థ్యాలలో వెనుకబాటును గమనించిన జిల్లా కలెక్టర్ టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ (%ఖు =ూ%) 100 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని (వ్యక్తిగత ఆసక్తి) అల్లూరి జిల్లాలో ప్రత్యేకంగా ప్రారంభించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో ఉన్నప్పటికీ అల్లూరి జిల్లాలో మాత్రం 100 రోజులలో విద్యార్థులలో భాష మరియు గణితంలో కనీస నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచేలా రూపొందించారన్నారు ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు మూడు రోజుల చొప్పున మూడు భాగాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తుండడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.ఆర్.పి లు ఎస్ ప్రకాష్ కుమార్, చంద్రశేఖర్, కే వసంత్ కుమార్, మత్స్యరాజు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ ఇన్స్పెక్టర్‌గా జె.రామకృష్ణ

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు : ముంచింగిపుట్టు మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ జె.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీలేరు పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై ముంచంగిపుట్టు స్టేషన్కు వచ్చానని ఈరోజు ఆయన తెలిపారు మండలంలో పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను కాపాడేందుకు కఠినంగా ఉంటానన్నారు సిబ్బందితో సమన్వయం పనిచేస్తానన్నారు మండలంలో గంజాయి సాగు అక్రమ రవాణా నియంత్రణపై కఠినంగా కఠినంగా నిర్ణయలుంటాయనారు మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరింస్తానన్నారు స్థానిక పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐ రామకృష్ణ స్వాగతం పలికారు.

సస్యరక్షణ పద్ధతితో రైతుకు ఆర్థిక పురోగతి

ప్లాంటేషన్ సూపర్వైజర్ వి.రంగారావు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : సిల్వర్ ఓక్ మొక్కలను పెంచుకునే రైతులు సస్యరక్షణ యాజ మాన్య పద్ధతిలో సాగు చేస్తే రైతులు మరింత ఆర్థిక పురోగతి సాధించగలరని అరుకు క్లస్టర్ ప్లాంటేషన్ సూపర్వైజర్ వి.రంగారావు సూచించారు. మండలంలోని పోతంగి పంచాయితీ పరిధిలోనున్న లివిటి పుట్ గ్రామంలో నీ2024బి25 ఆర్థిక సంవత్సరంలో ఆర్టికల్చర్ ఐటీడీఏ ద్వారా 13 మంది రైతులు సిల్వర్ ఓక్ మొక్కలను పొంది ఉన్నారు. మొక్కల పెంపకాల మెళుకువలపై రైతులకు ఆయన సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు క్లస్టర్ ఏపీ డి ఆదేశాల మేరకు సిల్వర్ మొక్కలు పొందిన రైతులకు మొక్క చనిపోకుండా ఉండాలంటే మొక్క చుట్టూ కలుపు తీసి, గొయ్యి త్రవి మొక్క చుట్టూ గడ్డితో కప్పి మల్చింగ్ చేయాలని, ఫలితంగా ఎండాకాలంలో కూడా మొక్కకు తేమ తడి ఆవిరైపోకుండా మొక్క బ్రతికే అవకాశం ఉంటుందని రైతులకు ఆయన సూచించారు. సస్య సంరక్షణ యజమాన్య పద్ధతి సాగునని ఆయన తెలిపారు. ఇటువంటి మేలుకోలను రైతులు అలవర్చుకొని మొక్కలను సంరక్షించుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో పోతంగి పంచాయితీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్. శాంతకుమారి, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలు తెరవాలి

విశాలాంధ్ర - బెలగాం : ధాన్యం కోతలు మొదలై ధాన్యం తయారవుతున్నాయని వ్యాపారులు రైతుల వద్ద 100 కిలోలకు బదులు 105-108 కిలోల వరకు తీసుకొంటున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ఆరోపించారు. ఈమేరకు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాలుకు 2,300 రూపాయలు కాగా వ్యాపారులు 1,750 నుండి 1,800 రూ.లకే తీసుకుంటున్నారని, మరో వైపు నేటి వరకు రైతు భరోసా కేంద్రాలు ప్రారంభంకాలేదని అందువలన బ్రోకర్లకు, వ్యాపారులకు, రైస్ మిల్లర్లకు రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకే అమ్ముకోవలసి వస్తున్నదని, తక్షణమే రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించి రైతు నుండి ధాన్యం కొనుగోలు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. రైతుకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, కార్యదర్శి ఆర్. లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం : మాజీ ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : స్థానిక సంస్థల కోటాలో జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత మనందరి పైన ఉందని మాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు అన్నారు. ఉపఎన్నికపై పార్వతీపురం నియోజకవర్గం స్థాయి ప్రజా ప్రతినిధి ఓటర్లకు దిశా నిర్దేశం చేశారు.స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ నేడు విడుదలైన నేపథ్యంలో రాష్ట్ర వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాను సారం, జిల్లా పార్టీ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ సూచనలతో సోమవారం పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నిర్దేశించిన అభ్యర్థినీ మన అందరం గెలువుంచుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు యిండుపూరు గున్నేశ్వరరావు, కొండపల్లి రుక్మిణి, జడ్పిటిసిలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జి, బలగ రేవతమ్మ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, బలగ రమణమ్మ, పురపాలక సంఘం పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు వెలిది సాయిరాం, బంకురి రవికుమార్, సిద్ద జగన్నాథం, బెవర హేమలత, సూర్య నారాయణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మండలంలో ప్రారంభమైన 21వ పశుగణన కార్యక్రమం

విశాలాంధ్ర - అనంతగిరి : అనంతగిరి నవంబర్ 4 కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 21వ పశుగణన కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించినట్లు కాశీపట్నం పశు వైద్యాధికారి సాగర్ గణేష్ శ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి ప్రారంభమైన ఈ పశుగణన ఫిబ్రవరి నెలాఖరి వరకు జరుగుతుందన్నారు. మండల పరిధిలో 293 రెవిన్యూ గ్రామాలలో 12941 కుటుంబాలు యొక్క పశుసంపద వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో 16 రకాల పశు జాతులు వివరాలు నమోదు చేస్తామని తెలిపారు కాశీపట్నం గ్రామంలో పశుగణన ఏ విధంగా జరుగుతుంది అనే విషయాన్ని పరిశీలించామని తెలిపారు పశుగణనకు రైతులు ప్రజలు పూర్తి వివరాలు ఇచ్చి సహకరించాలని దీని వల్ల భవిష్యత్తులో అనేక ఉపయోగాలు ఉంటాయని పశుగణన పర్యవేక్షణ అధికారి అన్నారు.

గతంలో మధ్యనిషేధం సున్నా... నేడు బెల్ట్ షాపుల నిషేధం కూడా అంతే మరి

విశాలాంధ్ర - పార్వతీపురం : మద్యం అమ్మకాలు జరగకపోతే ఈరాష్ట్రంలో పరిపాలన జరగదా అన్నఆలోచన అన్ని వర్గాల్లో పెరగడం గమనార్హం. ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలుచేయాలంటే మద్యంఅమ్మకాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గతప్రభుత్వంలో, నేటి ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. గత ప్రభుత్వంలో పెద్దఎత్తున మద్యంరేట్లు పెంచి మద్యం అమ్మకాలు చేపట్టడంతో పాటు నాణ్యమైన మద్యం అమ్మకాలు చేయలేదని అప్పట్లో ఆరోపణఉండగా, నేటి ప్రభుత్వంలో ఇంకా పాతమద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారని,కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన 99 రూపాయల క్వార్టర్ మద్యం ఇంకా అందుబాటులోకి రాలేదని మద్యం ప్రియులు వాపోతున్నారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో దశలవారీ మద్య నిషేధమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ ప్రభుత్వం తరఫున మద్యం షాపులు పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. దశలవారీగా మద్యం నిషేధం చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రకటనలు ఆచరణలో నెలకొనలేదుకదా ప్రతీఏటా షాపులుసంఖ్యను గణనీయంగా పెంచి నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడికక్కడ షాపులుపెట్టి రాష్ట్రానికి ఆదాయ వనరులు పెద్దఎత్తున మద్యం నుండి వచ్చేలా చేశారన్నది యదార్థం. గత ప్రభుత్వంలో ఇలాఉంటే నేటి ఎన్‌డిఎ ఉమ్మడి ప్రభుత్వంలో 20 రోజుల క్రితం మద్యంషాపులను లాటరీవిధానంలో ఎంపికచేసి ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇంతవరకు షాపులకు శాశ్వతలైసెన్సులు ఇవ్వకపోవడంతో వారునచ్చినచోట షాపులను పెట్టి వ్యాపారం చేస్తున్నారు. ఈనెల 11వరకు తాత్కాలిక లైసెన్సులవిధానము అమల్లో ఉందని, ఈనెల 11తర్వాత శాశ్వతముగా ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం షాపులు ఏర్పాటుచేయడం జరుగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలియజేస్తున్నారు.అయితే గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే తాటతీస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుండి స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారుల వరకు పెద్దఎత్తున హెచ్చరికలు జారీచేస్తున్న సంగతి తెలిసిందే. కానీ గ్రామగ్రామాల్లో పెద్దఎత్తున బెల్ట్ షాపులు కిరాణాషాపుల తరహాలో ఏర్పాటుచేసి మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. చాలాగ్రామాల్లో పాటలు కూడా పెట్టి సిండికేట్ వ్యాపారుల అడుగుజాడల్లో ఈ బెల్ట్ షాపులు నడుస్తున్నాయని చెప్పడంలో సందేహం లేదు. పెద్దఎత్తున డబ్బులను మద్యం షాపులలో పెట్టడంతో తమకులాభంకంటే పెట్టినపెట్టుబడి త్వరగా రావాలన్న ఉద్దేశంతో వ్యాపారులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. మద్యంషాపులు నిర్వహించేవారే బెల్ట్ షాపులు పెట్టేందుకు గ్రామనాయకులతో సంప్రదింపులు జరిపి పాటలు పెట్టించి బెల్ట్ షాపులు విధానానికి శ్రీకారం చుదుతున్నారని చెప్పడంలో ఎటువంటి సందేహంలేదు. నేటిమద్యం వ్యాపారంలో అధికార, ప్రతిపక్షరాజకీయ నాయకులే ఎక్కువమంది ఉండడంతో బెల్ట్ షాపులు నిర్వహించేందుకు గ్రామాల్లో ఉండే చిల్లరవర్తకులు పాటల పాడేందుకు ముందుకు రావడం సర్వత్రాకనిపిస్తుంది.

ఏదేమైనా మద్యం నిషేధించడమన్నది ఇక జరగదని, బెల్ట్ షాపుల నిషేధంకూడా జరగదన్నది యదార్థమైన అంశముగా చెప్పవచ్చు. ప్రస్తుత సమాజంలో మద్యం అమ్మకాలు కూడా ఒకవ్యాపార వస్తువుగానే ప్రజలు చూడటం గమనార్హం. ఎన్నో కుటుంబాలు మద్యంవలన చిన్నాభిన్నమవుతున్న 2024 రాజకీయాల మార్పులో మద్యం కీలకమైన అంశంగా మారడం నేటిసమాజంలో మనఆలోచన విధానం ఎలాఉన్నది దీనిద్వారా తెలుసుకోవచ్చుమరి

అంగన్వాడీ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్న ఐసీడీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గంగవరం : అంగన్వాడి కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్న ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడి కార్యకర్తలు ఒకరోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ నెలలో ఒకసారి మాత్రమే ప్రాజెక్ట్, సెక్టార్ మీటింగ్ లు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం 300 రూపాయలు మాత్రమే ఇస్తుందని సిలిండర్ 1100 రూపాయలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని అందువల్ల గ్యాస్ను సరఫరా చేయాలని లేనిపక్షంలో కట్టెలతో వంటలు చేయాల్సి చేయాల్సి ఉంటుందన్నారు. వర్కర్ సిగ్నల్ లోకి వెళ్లిన సమయంలో సెంటర్‌ను విజిట్ చేసి మేము ఇవ్వకూడదన్నారు. అలాగే జీతం కట్ చేయరాదన్నారు. ఇచ్చిన బిల్లులను బుట్ట దాఖలు చేసి మళ్లీ మళ్లీ రాసి ఇవ్వమని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఫ్రీ స్కూల్ హాజరు 10 గంటలకే వేయమంటున్నారని పొద్దున లేని వారి పరిస్థితి ఏమిటనే ఆమె ప్రశ్నించారు. జీడి పాలెం, జడేరువర్కర్లు,హెల్పర్ల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం చేసిన ధర్నాకు గీతం కట్ చేయరాదన్నారు. సెంటర్లకు సరఫరా అవుతున్న స్టాకు తక్కువగా ఉంటుందన్నారు. పబ్లిక్ హాలిడే రోజు వర్క్ చేయాలని ఒత్తిడి చేయకూడదన్నారు. సెంటర్‌కు విజిట్‌కు వచ్చినప్పుడు హెల్పర్ కు ఆరోగ్యం బాగోలేక రా లేకపోతే రిజైన్ చేయమని ఒత్తిడి చేయకూడదన్నారు. ఈ ధర్నాకు మద్దతుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శాంతిరాజు మద్దతు తెలిపారు. ఆశా వర్కర్లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీల సంఘం జిల్లా కార్యదర్శి బి.నిర్మల, ప్రాజెక్ట్అధ్యక్షురాలు నాగదేవి, ప్రాజెక్టు కార్యదర్శి, సిఐటియు మండల బాధ్యురాలు, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలుచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల తహశీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి ఎన్నికలపై జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.వి.మాధవ్ రెడ్డితో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 1నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. అందులో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలు, ఫ్లెక్సీ బ్యానర్లు, చిత్రపటాలను తొలగించాల్సి ఉందన్నారు. కావున ఎన్నికల కోడ్ అమలవుతున్న మండలాల పరిధిలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు తక్షణమే ముసుగువేయాలని, ఫ్లెక్సీలను తొలగించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లోని చిత్రపటాలను తీసివేయాలని కలెక్టర్ ఆదేశించారు.సాదారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికలకు ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేసారు. అందువలన జిల్లాలో రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాల్లో పాల్గొనరాదని అన్నారు. ఎటువంటి నూతన కార్యక్రమాలు, విధానాలను అధికారికంగా ప్రకటించరాదని అధికారులకు కలెక్టర్ హితవు పలికారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బందికి ఈ విషయాన్ని తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గంతో పాటు జిల్లా కేంద్రంగా ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతీ మండలానికి ఎంసీసీ బృందం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ప్రచారాలకు, ర్యాలీలకు, లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని ప్రతీ ఖర్చును లెక్కించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. గతంలో ఎన్నికలు నిర్వహించినప్పటికీ అందరూ అప్రమత్తంగా ఉండాలని, జిల్లా నుంచి ఎటువంటి ప్రతికూల వార్తలు రాకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తూ.చ తప్పకుండా పాటించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల తహశీల్దారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్ప్ అవార్డుకు నామినేషన్లు పంపండి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన ఉత్తమ కార్యాలయానికి స్వచ్ఛ సంకల్ప్ అవార్డును ప్రకటిస్తూ, ఆ అధికారికి సత్కారం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రకటించారు. ఈ అవార్డులను ప్రతి నెలా ప్రకటిస్తామని, ఉత్తమ కార్యాలయానికి సంబంధించిన నామినేషన్లను ప్రతి నెల 25లోగా తమకు సమర్పించాలని తెలిపారు. కార్యాలయాలకు వైట్ వాష్ చేయడం, కార్యాలయం పేరు గల బోర్డు, నోటీసు బోర్డు, ఫిర్యాదుల బాక్సును ఏర్పాటుచేయాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దిన కార్యాలయాల వీడియోలు, ఫొటోలను పరిశీలించి ఉత్తమంగా నిలిచిన కార్యాలయానికి స్వచ్ఛ సంకల్ప్ అవార్డును ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. అవార్డు పొందిన అధికారికి ప్రతి నెల మొదటి సోమవారం రోజున సత్కార కార్యక్రమాన్ని చేపడతామని కలెక్టర్ స్పష్టం చేసారు. వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని, వాటికి శాశ్వత పరిష్కారాన్ని తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆధార్ తో అనుసంధానమైన కొన్ని అంశాలపై ప్రధానంగా సమస్యలు తలెత్తు తున్నాయని, అటువంటి సమస్యలను తొలగించేందుకు జిల్లాలో ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తున్నాయని అన్నారు.వీటిపై గ్రామ,మండల స్థాయిలోని ప్రజలకు తెలిసేలా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే కొనసాగుతున్న రహదారి మరమ్మతు పనులు త్వరిత గతిన పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, రంగులు వేయడం వంటి పనులను పరిశీలించి చర్యలు చేపట్టాలని, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ వివరించారు. కాగిత రహిత పాలనను అందించే దిశగా, ఇకపై ప్రతి శాఖాధికారి తమ శాఖకు సంబంధించిన ఫైళ్లను ఇ-ఆఫీస్ ద్వారా సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం : ఎంపీడీవో

విశాలాంధ్ర - గంగవరం : ఈనెల 6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పిజీ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అందరు ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు.

ఆధార్‌లో తప్పులు... అపార్‌కు చిక్కులు

అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల తిప్పలు

విశాలాంధ్ర - కూనవరం : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన పౌరసాంకేతిక పురోబి ,వృద్ధిలో ఆధార్ కార్డుది కీలకమైన పాత్ర అని అందరికీ తెలిసిందే. అదే విధంగా దేశవ్యాప్తంగా ఇప్పుడు విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం మరో అత్యాధునిక సాంకేతిక గుర్తింపు కార్డుని తీసుకువచ్చింది దాని పేరే అపార్ కార్డు.ఎల్కేజీ చదివే విద్యార్థి నుంచి పీహెచ్డీ చేసే వారి వరకు ఈ అపార్ కార్డు అవసరమే. ఒక విద్యార్థి ఏ స్కూల్లో, ఏ కోర్సు, ఎన్నిసంవత్సరాలు చదివాడో, ఎన్ని మార్కులు వచ్చాయి, ఆ కాలేజీ ఏ యూనివర్సిటీ పరిధిలో ఉంటుంది, అతనికి ఉన్న సాంకేతిక నైపుణ్యాలు ఏమిటి మొత్తం ఏ టు జెడ్ అకాడమిక్ సమాచారం ఈ అపార్ కార్డులో ఉంటుంది. ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడుగాని, ఉద్యోగాలకు అప్లై చేసేటప్పుడు గానీ ఇకముందులా సర్టిఫికెట్లు ఫైల్స్ పట్టుకొని తిరగాల్సిన అవసరంలేదు. ఒక అపార్ట్ కార్డు తన విద్య ఉద్యోగ సమాచారం మొత్తాన్ని ఒకే ఒక క్లిక్ ద్వారా తెలియపరుస్తుంది. అలాంటి అపార్ కార్డుని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన పరిస్థితి ఉంది దానికి ఆధార్ కార్డే మూలం. కానీ ఇక్కడ వచ్చిన చిక్కల్లా దాదాపు 90 శాతం మంది విద్యార్థుల ఆధార్ కార్డులో ఖచ్చితమైన సమాచారం లేదు. పుట్టినతేదీ, ఊరు పేరు, తండ్రి పేరు, సొంత పేరు, ఫోన్ నెంబరు, ఏదో ఒక చిన్న పొరపాటు ఆధార్ కార్డులో ఉన్నాకూడా ఈ అపార్ కార్డు రాదు. దీనికోసం ఆధార్ కార్డులో తప్పులను సరి చేయించుకోవడం సచివాలయాల చుట్టూ విద్యార్థులు రోజుల తరబడి తిరుగుతున్నారు. కానీ ఏజెన్సీలో కొందరు సెక్రటరీల పనితీరు గురించి వేరే చెప్పనక్కర్లేదు. వారు ఎప్పుడు ఉంటారో, ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియదు. ఫోన్ చేస్తే రెండే రెండు సమాధానాలు వస్తాయి ఒకటి హాస్పిటల్ లో ఉన్నాను, లేదా మీటింగ్ లో ఉన్నాను. సచివాలయాల్లో మాత్రం ఉండరు. కాబట్టి కలెక్టర్ స్థాయి అధికారులు దీని కోసం ఒక స్పెషల్ డ్రైవ్ ఏర్పాటుచేసి విద్యార్థుల ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరిచేసే బాధ్యత సెక్రటరీలు తీసుకోవాలని ఆదేశించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీలో జిల్లాలో 4వ స్థానంలో కొయ్యూరు

విశాలాంధ్ర - కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో పింఛన్ల పంపిణీలో కొయ్యూరు మండలం నాలుగవ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందని ఎంపీడీవో ఎస్కేవి.ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఆగస్టు సెప్టెంబర్ నెలలతో పాటు అక్టోబర్ నెలలో కూడా రాష్ట్రంలో పింఛన్ల పంపిణీలో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించటంతో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారన్నారు. దీనిలో భాగంగా పింఛన్ పంపిణీలో మొదటి స్థానం సాధించిన జిల్లాలో కొయ్యూరు మండలం పింఛన్ల పంపిణీలో నాలుగో స్థానంలో నిలిచి పలు మండలాలకు ఆదర్శంగా నిలి చిందన్నారు. అంకిత భావంతో కష్టపడి పని చేసిన మండల సచివాలయ సిబ్బంది అందరికీ ఎంపీడీవో ప్రసాద్ ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ఇకపై కూడా అంకితభావంతో పనిచేసే మండలాన్ని మొదటి స్థానానికి తీసుకురావాలని ఆకాంక్షించారు.

జిల్లాలో 49 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో 49 ఆధార్ కేంద్రాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 49 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని - ఆధార్ అప్డేషన్, పేర్లు,చిరునామా, పుట్టిన తేదీలు తదితర మార్పులు చేసుకోవచ్చని ఆయన అన్నారు. పుట్టిన తేది మార్పుకు నిర్ధిష్ట ధృవ పత్రం సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. ఇతర అంశాలకు గెజిటెడ్ లేదా ధ్రువీకరణ అధీకృత అధికారం గల అధికారి నుండి తీసుకుని సమర్పించవచ్చని అన్నారు. బలిజిపేట మండలంలో అరసాడ, బలిజిపేట సచివాలయాల్లో భామిని మండలంలో బత్తిలి2, గణసార సచివాలయాల్లో, గరుగుబిల్లి మండలంలో గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర సచివాలయాల్లో, గుమ్మలక్ష్మీపురం మండలంలో బాలేసు, గుమ్మలక్ష్మీపురం, కొండవాడ, ఇరిడి సచివాలయాల్లో, జియ్యమ్మవలస మండలంలో అలమండ, బి.జె పురం, గవరంపేట సచివాలయాల్లో, కొమరాడ మండలంలో గంగరేగులవలస, మాదిలింగి, పెదశాఖ,సచివాలయాల్లో, కురుపాం మండలంలో గుమ్మ, మొండెంఖల్లు, పెద్ద గొట్టిలి, ఆర్.కె.బై సచివాలయాల్లో, మక్కువ మండలంలో డి.శ్రీలం, మక్కువ 1, 2, సంబర సచివాలయాల్లో పాచిపెంట మండలంలో పనుకువలస సచివాలయంలో, పాలకొండ మండలంలో నిలమ్మ కాలనీ, ఎం. సింగిపురం సచివాలయాల్లో, పార్వతీపురం మండలంలో జగన్నాధపురం -01, కొత్త బెలగాం -01, డోకిశీల, పెద్ద మరికి సచివాలయాల్లో, సాలూరు మండలంలో కూరుకుట్టి, పెద్దపదం, రామా కాలనీ సచివాలయాల్లో సీతంపేట మండలంలో దారపాడు, దోనుబై, గోయిడి, కిల్లాడ, సీతంపేట ఎ, సోమగండి సచివాలయాల్లో, సీతానగరం మండలంలో అంటిపేట సచివాలయంలో, వీరఘట్టం మండలంలో కత్తులు కవిటి, పనసనందివాడ, వండవా, వీరఘట్టం1,3 సచివాలయల వద్ద ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని ఆయన తెలిపారు. ఈసమావేశంలోపార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీ పై శిక్షణ

విశాలాంధ్ర - అనంతగిరి : మండలంలో అల్లూరి జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మండల సచివాలయం సిబ్బంది ప్రతి ఒక్కరికి హైదరబాద్ నిజామ్ ఇన్స్టిట్యూట్ వారి ద్వారా ఫిజియో థెరపీ పై శిక్షణ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవి కుమార్ తెలిపారు. సోమవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో ఫిజియో థెరపీ నిపుణులు మన ఆరోగ్యమే మహాభాగ్యము అనే అంశంపై అందరికీ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈరోజుల్లో మనం రోజూ వారి పనుల్లో మరి ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో మనం తెలిసి తెలియక చేసిన పొరపాట్లు, మన ఆహారపు అలవాట్లు వల్ల ఏవిధంగా అనారోగ్యాలకు గురి ఔతున్నం అన్నది ప్రయోగ పూర్వకంగా తెలిపారు. ముఖ్యంగా వృత్తి రీత్యా ఒక ఉద్యోగి ఎంతో ఒత్తిడికి గురౌతున్నారు దానిమూలంగా దీర్ఘకాలిక రోగాల బారిపడుతున్నారు అన్నారు. గుండె నొప్పులు, కీలనొప్పులు,పక్షవాతం మొదలగు దీర్ఘ కాలిక రోగాలు వచ్చినప్పుడు ఫిజియో థెరపీ లో భాగంగా తక్కువ ఖర్చుతో ,ఎటువంటి ఆర్థికభారం పడకుండా రోగాలు నయం కావడానికి గల విధానాలను ప్రయోగ పూర్వకంగా తెలిపారు. మొబైల్ ఫోన్లు విపరీతంగా వాడటం వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రయోగ పూర్వకంగా తెలిపారు. అలాగే చిన్న పిల్లలకు మొబైల్ ఫోన్లు నుండి దూరంగా ఉంచాలని తెలిపారు. ఫిజియో థెరపీ నిపుణులతో పాటు, ఈఓ పీఆర్ ఆర్డి సీతయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సా..... రొస్తారొస్తారే..

నాలుగు రోజులుగా విధులకు డుమ్మా. సెక్రటరీ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - కూనవరం : రోజుకి 200 రూపాయలు ఇచ్చి ఇంటిపనికో, చేనుపనికో ఒక కూలీని నియమిస్తే ప్రతి గంటా జాగ్రత్తగా తనతో పని చేయించుకుంటాం. మరి రోజుకి 2000 రూపాయలు మన కష్టార్జితం పన్నులుగా కట్టిన డబ్బుల్ని వేతనంగా తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగి తన ఇష్టం వచ్చినట్టు నాలుగు రోజులుగా పనిమానేసి కుంటి సాకులు చెబుతుంటే ఎందుకు ప్రశ్నించకూడదు? ఆ హక్కు ప్రతి పౌరుడికి ఉంటుంది కదా. గత నాలుగు రోజులుగా కూనవరం సెక్రటరీ సచివాలయానికి రాకపోవడం వలన కూలి పనులు చేసుకునే ప్రజలు అర్జీలు పట్టుకొని పనులు మానుకొని ఉపాధి కోల్పోయిమరీ వేచిచూడాల్సి వస్తుంది. ఇది సరైన పద్ధతి కాదు. ఒక ఉద్యోగి సెలవుపై వెళితే తాను వచ్చేదాకా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంటే ఆ గ్రామ పరిపాలన సవ్యంగా సాగుతున్నట్టా? అధికారులు ఆలోచించాలి. తాను వచ్చిందాకా ప్రజలు వేచిచూడాలా.? అలా ప్రజల పనులు ఆగిపోతే అంతకంటే దుర్భరం ఇంకోటి లేదు.ఈ పరిస్థితి మారాలంటే ప్రజల్లో చైతన్యం రావాలి. ఏ అధికారి విధులకు రాకపోతే ఆ ఖాళీ కుర్చీ ఫోటో కలెక్టర్ దాకా చేరాలి.

ఇలా అయితే పరిపాలన ఎలా ?

- 11పంచాయతీలో కార్యదర్శులు - 9పంచాయతీలలో డిజిటల్ అసిస్టెంట్లు ఖాళీ

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో పంచాయితీల పాలనాపరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. బదిలీలే కొంపముంచాయని, బదిలీపై వెళ్లిపోయిన వారే కానీ ఆస్థానంలో భర్తీకి బదిలీ అయిన వారు వచ్చి చేరకుండా పరిపాలనకు పంగనామం పెడుతున్నారు. దీనంతటికీ కారణం ఉన్నతాధికారుల ఉదాసీనతేనని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మండలంలో 31 పంచాయతీలు ఉండగా అందులో 11 పంచాయితీలు అయిన అర్నాడ,, అలమండ,, పిటిమండ,, జియ్యమ్మ వలస, కుదమ, తుంబలి, తురక నాయుడు వలస, చిన మేరంగి, కొండ చిలకాం, జోగులడుమ్మ, వరజపాడు పంచాయితీలకు కార్యదర్శులులేరు. 9పంచాయితీలకు డిజిటల్ అసిస్టెంట్ లు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు .అర్నాడ, శిఖబడి, పిటిమండ, చినమేరంగి, గవరమ్మపేట, అల్లువాడ, కుదమ, ఇటిక, తుంబలిపంచాయతీ లలో లేకపోవడం బాధాకరం.. అదేవిధంగా తాళ్లడమ్మ, జియ్యమ్మ వలస, శిఖబడి దంగభద్ర బీజేపురం బిజె పురం అంకవరం, పెదమేరంగి, తుంబలిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లేరు. అలాగే అర్నాడ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లేరు. ఇక ఎంపీడీవో కార్యాలయంలోకి వస్తే 2023 జూన్ 28 నుండి టైపిస్టు లేరు. అదేవిధంగా జనవరి 2024 నుండి ఈవో పిఆర్డి లేరు. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా తయారయ్యింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభివృద్ధి బాటలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. దీనిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని ఖాళీలను భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మన్య ప్రాంతంలో పనిచేయడం సంతృప్తిని కలిగించింది

సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్

విశాలాంధ్ర - చింతపల్లి : మన్య ప్రాంతంలో పనిచేయడం సంతృప్తిని కలిగించిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ అన్నారు. చింతపల్లి పోలీస్ స్టేషన్లో గడచిన రెండేళ్లుగా విధులు నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ సాధారణ బదిలీలలో భాగంగా విశాఖ సిటీకి బదిలీ కావడంతో సోమవారం ఆయన చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఆయనను స్థానిక పాత్రికేయం బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఈ ప్రాంతంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఆయన అందించిన సేవలను పాత్రికేయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు.

బడిదేవరమ్మను కాపాడుకుందాం....

6 నుంచి 9 వరకు పాదయాత్రకి కదలిరండి బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ పిలుపు

విశాలాంధ్ర - బెలగాం : బడిదేవరకొండ తవ్వకాలను ఆపాలని కొండ ప్రజలందరికి అండగా నిలుస్తుందని, మనల్ని కాపాడే అమృతమూర్తిని తవ్వే హక్కు ఏ ఒక్కరికి లేదని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం పార్వతీపురం స్థానిక సుంద రయ్య భవనంలో బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొండ తవ్వకాలకు మన ప్రాంతంతో సంబంధంలేని కొంతమంది పెత్తందారులు, భూస్వాములు క్వారీ యజమానికి అనుమతుల లైసెన్స్ ఇవ్వడంతో ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కొండని తవ్వుకుపోవడం అన్యాయమని దీనిని వెంటనే ఆపాలన్నారు. కొండ పార్వతీపురం మండలానికి జీవనాధారంగా నిలుస్తుందని, అది కొండ మాత్రమే కాదని వర్షించి మనకు సాగునీరిచ్చే అమ్మని, మనల్ని కాపాడే అమృతమూర్తి అని కాపాడుకునే బాధ్యత స్థానిక ప్రజలు, గిరిజనులందరిదని వాపోయారు. ఇప్పటికే పలుమార్లు కొండ తవ్వకాలు అక్రమమని ఇటు అధికారులకు అటు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో అనుమతులను రద్దు చేసిన ప్రభుత్వాలే నేడు అనుమతులు ఇవ్వడం విడ్డూరమని ఇచ్చిన లీజు లైసెన్సులు రద్దు చేయకుంటే పాదయాత్ర అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బుధవారం ఉదయం 11 గంటలకు పాత బస్టాండ్ నుండి పాదయాత్ర ప్రారంభమై వెంకంపేట, చిన్నబొండపల్లి, ఎంఆర్ నగరం, సంగంవలస, నడిమివలస, మడకవాని వలస, గంగాపురం, కోరి, హిందూపురం, సూడిగాం, పెదబొండపల్లి, దిబ్బగుడ్డివలస, పుట్టూరు, లచ్చిరాజుపేట, తాళ్లబురిడి, చలమవలస, డి. ములగ, ఎన్. ములగ, కవిటిభద్ర, కర్నాల ములగ గ్రామాలలో పర్యటించి సభ చేపట్టడం జరుగుతుందని ఈ పాదయాత్రకు మండల యావత్ ప్రజానీకం అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి కె. మన్మధరావు, ఎఐటియుసి నాయకులు ఆర్విఎస్ కుమార్, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. శ్రీనునాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. నర్సింగరావు, గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ పి. రంజిత్ కుమార్, భాషా, చెరువుల సంరక్షణ కమిటీ నాయకులు వంగల దాలినాయుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. విశ్వేశ్వరరావు, అఖిల భారత గ్రామీణ ఉపాధి కార్మిక సంఘ నాయకులు పి. సంగం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌తో క్యాంప్ రాజకీయాలకు సిద్ధపడుతున్న వైసీపీ

విశాలాంధ్ర - పార్వతీపురం : ఈనెల 28న జరగనున్న విజయనగరం, పార్వతీపురం ఉమ్మడిజిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకోసం సోమవారంనాడు నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రతిపక్ష పార్టీ వైఎస్ఆర్సిపి క్యాంప్ రాజకీయాలకు సిద్ధం అవుతోందని ఆపార్టీ నాయకుల మాటల్లో తెలిసింది . గతంలో విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్సిపికి స్పష్టమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎన్నిక జరిగేవరకు క్యాంప్ రాజకీయాలు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకైకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే.నేడు ఇదే తరహాలో ప్రస్తుతం కూడా వైఎస్ఆర్ సీపీకి పెద్దఎత్తున ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, పురపాలకసంఘ కౌన్సిలర్ల బలం ఉన్నప్పటికీ అధికారపక్షం ప్రలోభాలకు గురికాకుండా ఉండేవిధంగా గురువారం నుండి దూరప్రాంతాలకు తరలించే ఏర్పాట్లుచేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాజకీయాల్లో ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియనిపరిస్థితి ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రెండుజిల్లాల్లోని ఎమ్మెల్సీఎన్నికకు ఓటర్లు అయినా ఎంపీటీసీలు జడ్పిటిసిలు పురపాలక సంఘ కౌన్సిలర్లను క్యాంప్ లకు తరలించేందుకు అన్నిఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. సోమవారంనాడు రెండు జిల్లాల్లోని అన్ని శాసనసభ నియోజకవర్గ స్థాయిలో

సమావేశాలు కూడా నిర్వహించి సంకేతాలు ఇచ్చినట్లుతెలిసింది. నేడు చవితి ఉన్నదృష్ట్యా బుధవారం నుండి లేదా గురువారం నుండి వారందరిని తరలించే ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, దీనికి సంబంధించి కీలకమైన నాయకులకు బాధ్యతలు కూడా పార్టీ అప్పజెప్పినట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది. నామినేషన్ల గడువు ఈనెల 11 వరకు ఉన్నందున పదోతేదీనాటికి అధికార, ప్రతిపక్షాల అభ్యర్థులు ప్రకటన చేసే అవకాశంఉంది. వైయస్సార్సీపీకి అనుకూలంగా ఉన్నందున పార్వతీపురం మన్యంజిల్లాలోని ఎవరినైనా ఈ ఎమ్మెల్సీ అదృష్టం వరించే అవకాశం ఉందని విశ్లేషకులు తెలియజేస్తున్నారు. అధికార పక్షం ఈ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తుందా లేదాఅన్నది ఈ నెల 10వరకు తెలిసే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు తెలియజేస్తున్నారు. గతంలో విశాఖ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిని నిలబట్టని అధికార పక్షం ఈదఫా ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో అందరూ వేయికళ్లతో వేచి చూస్తున్నారు. అధికార పక్షం తరపున అభ్యర్థి ఎంపికలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆలోచన ఎలాఉంటుందో వేచిచూడాలి మరి. ప్రతిపక్షం వైయస్సార్ తరఫున మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అభ్యర్థిని ఎవరిని ప్రకటిస్తారో రెండు జిల్లాల్లో ఉత్కంఠ నెలకొంది. ఆయన ప్రకటనే తరువాయి ఏకగ్రీవము అయ్యే అవకాశం ఎక్కువగా ఉండటంతో రెండు జిల్లాల్లోని ఆశావాహులు పెద్ద ఎత్తున దీనికోసం ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి రెండు జిల్లాల నేతలతో సమన్వయ సమావేశంను వైఎస్ఆర్సిపి ఉత్తరాంధ్ర నేతలు ఆధ్వర్యంలో జరిగినట్లు తెలిసింది.

కిటకిటలాడిన శివాలయాలు

విశాలాంధ్ర - సీతానగరం : ఓంనమశ్శివాయ, హర హర మహాదేవ శంభో శంకర, అంటూ శివాలయాలన్నీ కార్తీక్ మాస సోమవారం నాడు కిటకిటలాడాయి. భక్తులు పెద్ద ఎత్తున వేకువజాము నుండే శివాలయాలకు తరలివచ్చారు. పలు గ్రామాల్లో సువర్ణముఖినదీ పరివాహక ప్రాంతంలో స్నానాలు చేసి ఆలయాలకు తరలి వెళ్లారు. మండల కేంద్రంలోని సువర్ణముకేశ్వరస్వామి ఆలయంలోనూ, గుచ్చిమి రామ లింగేశ్వరస్వామి ఆలయంలోనూ, కాసాపేట కాశీవిశ్వేశ్వర స్వామిఆలయంలోనూ, మరిపువలస భువనేశ్వర స్వామి ఆలయంలోనూ, నిడగల్లు, తామరకండి, గెద్దలుప్పి, బూర్జ, కోటసీతారాంపురం, జానుమల్లు వలస, గాదెలవలస తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉదయం పూట నుంచి రాత్రి వరకు పూజలు చేశారు.